క్లుప్తంగా

భారత జాగృతి మండల కన్వీనర్ల నియామకం



బోధన్/రెంజల్(బోధన్): భారత జాగృతి సంస్థ నియోజకవర్గం పరిధిలోని నూతనంగా మండల కన్వీనర్లను నియమించారు. బోధన్‌లోని తాలూకా రైస్‌మిల్లర్స్ అసోషియేషన్ భవన్‌లో శుక్రవారం సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీనా చారి సూచనల మేరకు, కొత్త మండల కన్వీనర్లకు జిల్లా అధ్యక్షుడు అవంతి కుమార్, నియోజకవర్గ అధ్యక్షుడు గట్టు హరికృష్ణలు నియామకపత్రాలను అందించారు. పట్టణ కన్వీనర్‌గా షేక్ ఇబ్రహీం, బోధన్, ఎడపల్లి, సాలూర, రెంజల్, నవీపేట మండలాల కన్వీనర్లుగా యార్లగడ్డ రాజశేఖర్, చిన్నమాధవ సురేందర్, బాసర శ్రీకాంత్, లోలం వినయ్‌రాజ్, ములుగు శివ, నియోజక వర్గ యూత్ కన్వీనర్‌గా న్యావనంది శ్రీకాంత్‌లు నియమించనట్లు నాయకులు తెలిపారు.



అవయవదానంతో పునర్జన్మ



ఆర్మూర్‌టౌన్: అత్యవసర సమయంలో అవయవదానం చేయడం వల్ల ఓ వ్యక్తికి పునర్జన్మ ఇచ్చినట్లు ఉంటుందని వక్త అనిల్ శ్రీవాస్తవ అన్నారు. పట్టణంలోని నరేంద్ర డిగ్రీ కళాశాలలో శుక్రవారం రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ ఆధ్వర్యంలో అవయవ దానం పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి యువతరం, ప్రజలు సమాజ సేవలో ముందుండాలన్నారు. రోటరి అధ్యక్షుడు పట్వారి గోపికృష్ణ, కార్యదర్శి పట్వారి తులసి, సభ్యులు పుష్పకరావు, దామోదర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు

ఆర్మూర్‌లో అమృత కలశ ర్యాలీ



ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని సాంఘీక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో 'మేరీ మాటి-మేరా దేశ్' అమృత కలశ యాత్రలో భాగంగా కళాశాల ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ధనవేణి మాట్లాడుతూ.. యువతలో దేశభక్తి ఉండాలన్నారు. దేశ భవిష్యత్తు యువత చేతిలో ఉందన్నారు. చదువుతో పాటు సమాజ సేవ చేస్తుండాలని సూచించారు. అలాగే పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైతం 'మేరీ మాటి-మేరా దేశ్' కార్యక్రమంలో భాగంగా అమృత కలశ యాత్ర నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ శరణ్య, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ చైతన్య, శాంతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



వర్ని: మండల మాజీ కో-ఆప్షన్ సభ్యుడు ఎజాజ్ ఖాన్ మాతృమూర్తి గురువారం మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని శుక్రవారం నిజామాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్న గారి విఠల్‌రావు పరామర్శించారు. బీఆర్ఎస్ నాయకులు నాగభూషణం, శంకర్, రాజు, శేఖర్ పాల్గొన్నారు.

బీఈడీ కళాశాలపై చర్యలు తీసుకోవాలి

తెయూ(డిచ్‌పల్లి): నిబంధనలకు విరుద్ధంగా విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న రాఘవేంద్ర బీఈడీ కళాశాలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ (టీజీవీపీ) నగర అధ్యక్షుడు అఖిల్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరిని కలిసి, వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా అఖిల్ మాట్లాడుతూ.. కళాశాలలో అర్హత గల అధ్యాపకులు లేరని, కనీస మౌలిక సదుపాయాలు, వసతులు లేకుండా నిర్వహిస్తున్నారని ఆరోపించారు. కళాశాలపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు మహేష్, సుజిత్ తదితరులు ఉన్నారు.

నిధులున్నా రోడ్లు నిర్మించలే..

- అమ్రాద్‌లో అసంపూర్తిగా సీసీరోడ్ల పనులు
- ఇబ్బందుల్లో గ్రామస్తులు



బురదమయమైన రహదారులు



అమ్రాద్ గ్రామంలో సీసీ లేని అంతర్గత రోడ్లు

మాక్లూర్: మండలంలోని అమ్రాద్ గ్రామంలో సీసీ రోడ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా పనులు పూర్తవకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ పరిధిలో 3వేల 445 మంది జనాభా ఉంది. గ్రామంలోని మట్టి రోడ్లు అధ్వానంగా మారడంతోపాటు, వర్షాలకు బురదమయంగా మారుతున్నాయి. ఈక్రమంలో మొదటి విడతగా ఎన్ఆర్‌జీఎస్ నుంచి వచ్చిన రూ. 10లక్షల నిధులతో సీసీ రోడ్లు తూతూమంత్రంగా చేసి చేతులు దులుపుకున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

రూ.40లక్షల నిధులు వచ్చినా..

రెండో విడతగా ఎన్ఆర్‌జీఎస్ నుంచి మండల వ్యాప్తంగా సీసీ రోడ్ల నిర్మాణాలకు మూడు నెలల క్రితం రూ. 8కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. నెల రోజుల్లో పనులు పూర్తి చేయాలని అధికారుల నుంచి ఒత్తిడి రావడంతో గ్రామాల్లో ఆఘమేఘాల మీదా సీసీ రోడ్లను పూర్తి చేశారు. కానీ అమ్రాద్ గ్రామానికి వచ్చిన రూ. 40 లక్షల నిధులతో పనులు ప్రారంభించి, అసంపూర్తిగా వదిలేశారు. సీసీ సర్పంచ్ ఆధ్వర్యంలో ప్రారంభమైన రోడ్ల నిర్మాణం ఇప్పటికీ పూర్తి కాకపోవటంతో గ్రామస్తులు సర్పంచ్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేవలం రూ. 10లక్షలతో కొన్ని చోట్ల సీసీ రోడ్లు వేసి మిగిత చోట్ల సీసీ రోడ్లు వేయటం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభం కాకపోవటంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లను పూర్తిచేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మా ఊరిలో రోడ్లు లేవు..



అన్ని ఊర్లలో గల్లీగల్లీకి రోడ్లు ఉన్నాయి. మా ఊరిలో రోడ్లు లేవు. కరెంట్‌పోయినప్పుడు రాత్రి సమయాల్లో వాహనదారులు రాళ్ల తగిలి గుంతల్లో పడి గాయపడుతున్నారు. సర్పంచ్‌ను అడుగుతే చప్పుడు చేయటం లేదు. సార్లు మా గల్లీలలో సీసీ రోడ్లు వేయించాలి.

– వెల్మల ఒడ్డెమ్మ, అమ్రాద్

స్పందించడం లేదు..

అమ్రాద్‌లో నిలిచిపోయిన సీసీ రోడ్ల పనులు పూర్తి చేయాలని చెబుతున్నా.. సర్పంచ్ వినటం లేదు. నేనేం చేయాలి. రూ: 40 లక్షల సీసీ రోడ్ల పనులకుగాను రూ: 10 లక్షల పనులు మాత్రమే చేశారు. ఇంకా రూ. 30 లక్షల సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉంది.

– శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఏఈ, మాక్లూర్

త్వరలో పనులు చేయిస్తాం..

అసంపూర్తిగానిలిచిపోయిన సీసీ రోడ్ల పనులను త్వరలో పూర్తిచేయిస్తాం. వర్షాల వల్ల పనులకు ఆటంకం కలిగింది. మంజూరైన నిధులతో సామగ్రిని తీసుకువచ్చాం. త్వరలో పనులను ప్రారంభించి, పూర్తిస్థాయిలో రహదారులను నిర్మిస్తాం.

– లింగం, సర్పంచ్, అమ్రాద్

ఘనంగా బతుకమ్మ సంబురాలు



బోధన్‌లోని ఇందూర్ బీఈడీ కళాశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ఇందూర్ బీఈడీ కళాశాలలో శుక్రవారం విద్యార్థులు బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలు పేర్చి పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు. అనంతరం సమీపంలోని కాలువలో బతుకమ్మను నిమజ్జనం చేశారు.

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని నలంద హైస్కూల్‌లో శుక్రవారం బతుకమ్మ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా విద్యార్థులు గుమ్మడి, గునుగు, బంతి, చామంతితో పాటు రంగురంగుల పూలతో బతుకమ్మను అందంగా పేర్చి గౌరి దేవతను ప్రతిష్ఠించారు. అనంతరం భక్తిశ్రద్ధలతో బతుకమ్మను పూజిస్తూ సంబురాలను జరుపుకున్నారు. నృత్యాలు చేస్తూ, బతుకమ్మ ఆడారు. అనంతరం స్థానిక చెరువులో బతుకమ్మను నిమజ్జనం చేశారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయినులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆర్మూర్ పరిధిలోని నలంద హైస్కూల్‌లో..

బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్

వర్ని: రాబోయే ఎన్నిల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త, నాయకుడు పనిచేయాలని బాన్సువాడ నియోజకవర్గ పార్టీ కన్వీనర్ కొత్తకొండ భాస్కర్ పిలుపునిచ్చారు. వర్ని మండల కేంద్రంలో శుక్రవారం ఆయన నియోజకవర్గ మండల అధ్యక్షులు, ముఖ్య కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు వ్యవహరిస్తున్న ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించి, బీజేపీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం పథకాలపై ప్రచారం నిర్వహించాలన్నారు. నాయకులు దొరబాబు, శ్రీనివాస్, శంకర్, చందు, ప్రకాష్ పటేల్, హనుమాండ్లు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలకు త్వరలో పరిష్కారం





తాడ్‌బిలోలిలో మహిళలతో మాట్లాడుతున్న మేడపాటి ప్రకాష్‌రెడ్డి.. బోధన్ పట్టణంలో..

రెంజల్(బోధన్): స్థానిక ప్రజల సమస్యలకు త్వరలో పరిష్కారం లభిస్తుందని, వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఆదరించి అవకాశం కల్పించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాష్‌రెడ్డి కోరారు. చాయ్ పే చర్చ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని తాడ్‌బిలోలి, బోర్గాం గ్రామాల్లో స్థానికులతో ఆయన సమావేశమై అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వచ్చే నెలలో జరిగే ఎన్నికల్లో అవినీతి పార్టీకి అధికారం ఇవ్వకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకునాలని ఆయా గ్రామాల ప్రజలకు సూచించారు. లేదంటే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఆయా గ్రామాల బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఎన్డీఎస్ఎల్ కార్మికుల దీక్షలకు మద్దతు

బోధన్: పట్టణంలోని ఎన్డీఎస్ఎస్ ఫ్యాక్టరీ ఎదుట కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేడపాటి ప్రకాష్‌రెడ్డి మద్దతు ప్రకటించారు. శుక్రవారం దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి, మాట్లాడారు. ఫ్యాక్టరీ మూసివేత వల్ల వందలాది కార్మిక కుటుంబాలు ఉపాధి కోల్పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ఆధికారంలోకి రాగానే షుగర్ ఫ్యాక్టరీని స్వాధీనం చేసుకుని పూర్వవైభవం తెస్తామని పేర్కొన్నారు. కార్మికులు, చెరుకు రైతులకు అండగా నిలుస్తామని తెలిపారు. నాయకులు సుధాకర్ చారి, కార్మిక నాయకులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక



ఎడపల్లి(బోధన్): మండలంలోని తాడేం గ్రామంలోని బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు శుక్రవారం బీజేపీలో చేరారు. వారికి గ్రామంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డీ మోహన్‌రెడ్డి బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు శ్రీధర్, యోగి, సూర కిరణ్, గెంటే శ్రీనివాస్, గుండా శ్రీనివాస్ పాల్గొన్నారు.

స.హ.చట్టం ప్రజల వజ్రాయుధం



ఆర్మూర్‌టౌన్: సమాచార హక్కు చట్టం అనేది ప్రజలకు వజ్రాయుధమని న్యాయవాది గటడి అనంద్ అన్నారు. పట్టణంలోని సీవీఆర్ జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థులకు సమాచార హక్కుచట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచి ప్రశ్నించే తత్వం అలవర్చుకోవాలన్నారు. గ్రామస్థాయి నుంచి పార్లమెంట్ వరకు తమకు కావాల్సిన సమాచారం ఈ చట్టం ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు. అలాగే ఈ చట్టం ద్వారా సాధించిన విజయాలు, దరఖాస్తు విధానాన్ని విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపల్ జాకీర్, అధ్యాపకులు మల్లికార్జున్, దిలీప్, రాజశేఖర్, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'గడపగడపకు కాంగ్రెస్' ప్రచారం





తిమ్మాపూర్‌లో ప్రజలకు కాంగ్రెస్ పథకాలను వివరిస్తున్న నాయకులు.. బోధన్ పట్టణంలో..

వర్ని: మోస్రా మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు గడపగడపకు కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ మేనిఫెస్టో ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజలకు వివరించారు. రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు ఓటు వేయాలని కోరారు. నాయకులు రోహిత్, కొత్తిమీరకార్ లక్ష్మణ్, ప్రవీణ్‌గౌడ్, తోటరాజు, శ్రీకాంత్, నరసింహారెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బోధన్ పట్టణంలో..

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని రాకాసీపేట్ లోగల 6వ వార్డులో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు 'గడపగడపకు కాంగ్రెస్' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పార్టీ నేతలు కాంగ్రెస్ పథకాలను ప్రజలకు వివరించారు. పాషామోయినొద్దిన్, నవీన్, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రిజ్వాన్, బడు, జహీర్, సద్దామ్ ఉన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై నేతలను నిలదీయాలి



సమావేశంలో మాట్లాడుతున్న దాసు

ఆర్మూర్‌టౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై నేతలను నిలదీయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి దాసు ప్రజలకు పిలుపునిచ్చారు. పట్టణంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో శుక్రవారం సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం ఉపాధి భద్రతను విస్మరించారని, కార్మిక వ్యతిరేక నాలుగు లెబర్‌కోడ్‌లను తీసుకువచ్చాన్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థకు అంటగడుతున్నారని అన్నారు. సీఎం కేసీఆర్ దళితున్ని ముఖ్యమంత్రిగా చేస్తానని, అర్హత కలిగిన దళిత కుటుంబానికి మూడెకరాల భూమి ఇస్తానని మాట ఇచ్చి మోసం చేశారన్నారు. పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలను నిలదీస్తూ, ఉద్యమించి, మెరుగైన సమాజం కోసం ఐక్యంగా పోరాడాలని పేర్కొన్నారు. నాయకులు సూర్య శివాజీ, ఖాజా మొయినుద్దీన్, బాలయ్య, అబ్దుల్, రవి తదితరులు పాల్గొన్నారు.

శని అమావాస్యకు ముస్తాబైన ఆలయం



కోనేరు వద్ద భక్తుల భద్రత కోసం ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

ఎడపల్లి(బోధన్): మండలంలోని జానకంపేటలో గల శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, అష్టముఖికోనేరును ఆలయ సిబ్బంది శుక్రవారం ముస్తాబు చేశారు. శనివారం అమావాస్య రోజు అష్టముఖి కోనేరులో స్నానాలు ఆచరించేందుకు భక్తులు భారీగా తరలిరానున్నారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లను పూర్తిచేశామని ఆలయ అధికారులు తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ రూరల్ ఇన్‌చార్జి డాక్టర్ భూపతిరెడ్డి

డిచ్‌పల్లి: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత కూడా నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో అధికార బీఆర్ఎస్ పార్టీ నాయకులు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ రూరల్ ఇన్‌చార్జి డాక్టర్ ఆర్.భూపతిరెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఆయన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతును కలిసి లిఖిత పూర్వక ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా భూపతిరెడ్డి మాట్లాడుతూ.. రూరల్ నియోజకవర్గంలో గృహలక్ష్మి, దళితబంధు, బీసీబంధు మంజూరు పత్రాలతో పాటు వివిధ అభివృద్ధి పనులకు నిధుల మంజూరు ప్రొసీడింగ్స్‌ను లబ్ధిదారులకు అందజేస్తున్నారని కలెక్టర్‌కు వివరించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండగా ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం ఎన్నికల కమిషన్ రూల్స్‌కు వ్యతిరేకమని, విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు ముప్పగంగారెడ్డి ఉన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి



రుద్రూర్: ప్రజలు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని మండల ఆరోగ్య విస్తరణ అధికారి గోవర్ధన్ పేర్కొన్నారు. పోతంగల్ మండలం దోమలెడ్గి, కారేగాం, హంగర్గా గ్రామాల్లో శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో ఆయన, వైద్య సిబ్బందితో కలిసి పర్యటించారు. ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. దోమల పట్ల అప్రమత్తంగా ఉండాలని, లార్వాను గుర్తించి తొలగించే విధానంపై అవగాహన కల్పించారు. వ్యాధులు వస్తే నిర్లక్ష్యం చేయకుండా ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స చేయించుకోవాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ సాయికుమారి, ఆరోగ్య కార్యకర్తలు సవిత, విజయ, ఆశలు రేష్మ, కరుణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు



మాక్లూర్: మండలంలోని చిక్లి గ్రామంలో శ్రీకృష్ణుడికి శుక్రవారం ఇస్కాన్ గౌరవ చంద్ర ప్రభు ధర్పల్లివాసులు ప్రత్యేక పూజలు, సంకీర్తనలు నిర్వహించారు. ఆటపాటలతో హరినామ స్మరణతో గ్రామంలో శోభాయాత్ర చేశారు. అనంతరం హరినామ స్మరణతో చిన్న పెద్ద తేడా లేకుండా ఆటపాటలతో కృష్ణ భగవంతుడిని వేడుకున్నారు. పూజల అనంతరం భక్తులకు అన్నప్రసాదం అందజేశారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	రాక్షసకావ్యం (తెలుగు) - 1.45 నగిలేటి కథ (తెలుగు) - 4.40 గాడ్ (తెలుగు) -7.15 తంతిరాం (తెలుగు) - 10.10
స్క్రీన్-2 –	మ్యాడ్ (తెలుగు) - 1.10, 4.00, 6.50, 9.40
స్క్రీన్-3 –	జవాన్ (తెలుగు) - 11.15, 2.40, 6.05, 9.30
స్క్రీన్-4 –	మధురపూడి గ్రామం (తెలుగు) - 1.00 చిన్న (తెలుగు) - 3.20, 9.50 స్కంద (తెలుగు) - 6.20

బంజారా పూజారులకు నిధులు, వేతనాలు ఇవ్వాలి



సమావేశంలో అభివాదం చేస్తున్న నాయకులు

నిజామాబాద్‌నాగారం: బ్రాహ్మణ పూజారులతో సమానంగా బంజారా పూజారులకు ధూపదీప నైవేద్యం నిమిత్తం ప్రభుత్వం నిధులతో పాటు, పూజారులకు వేతనాలు మంజూరు చేయాలని బంజారా పూజారుల సంఘం అధ్యక్షుడు రమేష్ డిమాండ్ చేశారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాల బంజారా పూజారులు సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆల్ ఇండియా జైహింద్ పార్టీ నిజామాబాద్ రూరల్ అభ్యర్థి అడ్వకేట్ బాలరాజుకు మద్దతుగా తీర్మానం చేశారు. ఈమేరకు బాలరాజుకు 'బి' ఫారంను సంఘ ప్రతినిధులు రమేష్ మహరాజ్, నారాయణ మహరాజ్, చరణ్ మహరాజ్ అందజేశారు. ఈసందర్భంగా సంఘం అధ్యక్షుడు రమేష్ మహరాజ్ మాట్లాడుతూ.. తండాల్లో బంజారా ఆరాధ్య దైవం సేవలాల్ జగదాంబమాత ఆలయాలు కట్టిన పూజారులపై రాష్ట్ర ప్రభుత్వం పెట్టించిన కేసులు ఎత్తివేయాలన్నారు. అనంతరం దశరథ రామిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం పూజారులందరిని సమానంగా చూడాలన్నారు. సంఘ ప్రతినిధులు నారాయణ, చరణ్, బలరాం, కిషన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి



ఖలీల్‌వాడి: అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు పార్టీ నగర్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం ఇచ్చారు. ఈసందర్భంగా పార్టీ నగర కార్యదర్శి సుధాకర్, డివిజన్ సహాయ కార్యదర్శి సాయగౌడ్‌లు మాట్లాడుతూ.. అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేవరకు పోరాటం ఆపేది లేదన్నారు. ఓట్లు కావాలంటే, నిరుపేదలకు ప్లాట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాయకులు గంగమల్లు, గంగారాం, అషుర్, ముత్యాల నారాయణ, లక్ష్మి, సుమలత, రాజేష్, అమూల్య, సావిత్రి, లలిత, మల్లేష్, అక్బర్, విజయ, కళావతి, నర్సింలు, గంగాధర్, సంతోష్, సుగుణ పాల్గొన్నారు.